క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ శ్రేణులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు, సంకు నాగశేషు

నిడమర్రు: వైఎస్సార్ సీపీ శ్రేణులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర విభజన విభాగం సహాయ కార్యదర్శి సంకు నాగశేషు ఆధ్వర్యంలో బువ్వనపల్లిలోని శేషుబాబు అతిథిగృహంలో సోమవారం సంకు నాగేషు బాబు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాసుబాబు హాజరయ్యారు. హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 26 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్స నిమిత్తం ఆస్పత్రికి రిఫర్ చేసారు. 150 మందికి చీరలు, దుప్పట్లు, పంచెలు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల బాధ్యులు పుప్పాల చినబాబు, కన్నబాబు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

పెదపాడు: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలను పెంపొందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఉపాధ్యాయులకు సూచించారు. పెదపాడు మండలంలోని కొత్త ముప్పర్రులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా నైపుణ్యాలను, మెనూ అమలును పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.

నారుమడుల పరిశీలన

దెందులూరు: గ్రామాల్లో నారుమడులను వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కే.సుబ్బారావు సోమవారం పరిశీలించారు. రైతులు వేగవంతంగా సాగు పనులు చేస్తున్న నేపథ్యంలో మండలం వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్‌తో కలిసి దెందులూరు, కొవ్వలి, ఉండ్రాజవరం గ్రామాల్లో సాగు పనులను ఆయన పరిశీలించారు. రైతులు త్వరితగతిన నాట్లు పూర్తి చేయాలని సూచించారు.

ఆయిల్‌పామ్ గెలలను వెనక్కి పంపడంపై రైతుల ఆగ్రహం

పెదవేగి : నాణ్యమైన ఆయిల్‌పామ్ గెలలన్నీ ఫ్యాక్టరీ తీసుకునేలా చర్యలు తీసుకుంటామని ఆయిల్ పామ్ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. పెదవేగిలోని ఏపీ ఆయిల్ఫెడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో సోమవారం రైతులు ఆందోళన నిర్వహించారు. కొన్ని ఆయిల్‌పామ్ గెలలు పక్వానికి రాని రాలేదంటూ ఫ్యాక్టరీ సిబ్బంది వెనక్కి పంపించారు. వాటిలో పండిన గెలలను తీసుకోవాలని రైతులు కోరినా ఫ్యాక్టరీ మేనేజర్ నారాయణ బాబు, క్వాలిటీ అధికారి, శశిధర్ నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన రైతులు అందోళనకు దిగారు. ఆయిల్ పామ్ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి రైతులతో ఫోన్లో మాట్లాడి గెలలు నాణ్యతగా లేకపోతే నూనె దిగుబడి శాతం తగ్గిపోతుందని, ఆ ప్రభావం ధరపై పడుతుందని నచ్చ చెప్పారు. రైతుల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై విచారణ

ఉంగుటూరు: మండలంలోని నాచుగుంట, గొల్లగూడెంలోని పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు నెలరోజులుగా అపహరణకు గురవుతున్నాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. దీనిపై ఏఈ, రైతులు చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 13 ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగలు, ఆయిల్‌ను అపహరిస్తున్నారు. ఈకేసుకు సంబంధించి ఆరుగురు నిందితులను వీరవాసరం చుట్టు పక్కల గ్రామాల నుంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇందులో ఒక నిందితుడు సోమవారం మృతి చెందాడు. మిగిలిన ఐదుగురు నిందితులు పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. కేసు నమోదు చేశాక వివరాలు తెలియజేస్తామని సీఐ సుభాష్ అన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధి.. వలంటీర్ వ్యవస్థ

గణపవరం: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సక్రమంగా లబ్ధిదారులకు అందించడంతో పాటు ఆయా కుటుంబాల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్న వలంటీర్ల వ్యవస్థను సంఘ విద్రోహ శక్తులుగా పోల్చడం దారుణం. వలంటీర్ల సేవలను రాష్ట్ర ప్రజలంతా ముక్తకంఠంతో ప్రశంసిస్తుంటే, ప్రతిపక్ష నాయకులకు మాత్రం వారు చేస్తున్న సేవలు కనిపించకపోవడం వారి అజ్ఞానానికి నిదర్శనం అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కరోనా సమయంలో అయినవారే మొహం చాటేయగా, వలంటీర్లు ప్రతి ఇంటి తలుపు తట్టి మేమున్నామంటూ భరోసా ఇచ్చి, వైరస్ బారిన పడినవారికి అండగా నిలిచి వారి ప్రాణాలు కాపాడిన విషయం దేశమంతా గుర్తించింది.

ప్రజలకు మెరుగైన సేవలు

ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాల్లో భాగస్వామి కావడంతో గణపవరంలోని వెలంపేట వలంటీరు బండారు శ్రావణి ఈ ఏడాది ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను పారదర్శకంగా, సకాలంలో లబ్ధిదారులకు అందించడం ద్వారా ఎంతో తృప్తిని పొందుతున్నానని ఆమె అన్నారు. మెరుగైన సేవలందించడంతో ఉత్తమ వలంటీరుగా ఎమ్మెల్యే వాసుబాబు చేతులమీదుగా సన్మానం పొందడం మరచిపోలేని అనుభూతి అని ఆమె ఆనందం వ్యక్తం చేశారు.



ఉత్తమ వలంటీరు అవార్డుతో బండారు శ్రావణిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

పింఛను ఇంటికి తెచ్చి ఇస్తున్నారు



నా వయస్సు 88 ఏళ్లు. నేను వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా మంచానపడినా వలంటీర్లు 1వ తేదీన తెల్లవారక ముందే నన్ను నిద్రలేపి మరీ పింఛను సొమ్ము చేతిలో పెడుతున్నారు. గతంలో పంచాయతీ కార్యాలయాల వద్ద రోజంతా పడిగాపులు కాసేవాళ్లం. కమిషన్లు ఇచ్చి పింఛను తెచ్చుకునేవాళ్లం. అలాంటిది వలంటీర్లు ఇంటి వద్దకే తెచ్చి మొత్తం పింఛను సొమ్ము చేతిలో పెడుతున్నారు. నాకు వారు ఆత్మీయులతో సమానం.

– దూసనపూడి సూర్యకాంతం,గణపవరం

ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లు



ప్రభుత్వానికి, ప్రజలకి వారధిలా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థపై పవన్ కల్యాణ్ అహంకారంతో అనుచిత వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్, చంద్రబాబులు కరోనా సమయంలో ప్రాణ భయంతో హైదరాబాదుకి పరిమితమయ్యారు. వలంటీర్లు ఇంటింటికీ ప్రజలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, రోగులకు మందులు అందించి మేమున్నామంటూ ధైర్యం చెప్పారు. ఒకటవ తేదీన తెల్లవారుజామున ఇంటింటికీ వెళ్లి అవ్వ, తాతలకు, వికలాంగులకు, వితంతువులకు పింఛను అందజేస్తున్నారు. ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలను ఎవరూ హర్షించరు.

– లేగల గణపతి, విజయరాయి, గ్రామ కాపు నేత

వలంటీర్ల జోలికి వస్తే సహించం



దెందులూరు: పవన్ కల్యాణ్‌తో పాటు ఎవరైనా వలంటీర్ల జోలికి వస్తే తడాఖా చూపిస్తాం. గ్రామగ్రామాన వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువలేనివి. సాధారణ సమయంలోనే కాకుండా కరోనా సమయంలో వలంటీర్లు కుటుంబ సభ్యులు మాదిరిగా సేవలందించారు. పవన్ కల్యాణ్ ఇతర రాష్ట్రంలో ఫామ్‌హౌస్‌లో ఉన్నారు. ఇలాంటి వ్యక్తికి వలంటీర్ల సేవలను విమర్శించే అర్హత లేదు. వలంటీర్లందరికీ మాలమహానాడు మద్దతుగా ఉంటుంది. వారి జోలికి వస్తే సహించేది లేదు.

– గొల్ల కిరణ్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు

వలంటీర్ల సేవలు ఎనలేనివి



పెదవేగి : నా పేరు పరసా వెంకటరత్నం, విజయరాయి గ్రామానికి చెందిన వ్యక్తిని. అనారోగ్యంతో వయస్సు మీద పడి వృద్ధాప్యంతో సతమవుతున్నాను. నేను విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మా ఊరు నుంచి మా పరిధిలోని వలంటీర్ పొట్లూరి రాట్నాలమ్మ పింఛన్ డబ్బులు తీసుకొచ్చి ఇస్తోంది. నా ఆనందానికి అవధులు లేవు. గతంలో నేనే స్వయంగా పింఛన్ సొమ్ము కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు నేను ఎక్కడ ఉంటే అక్కడకు తెచ్చి ఇస్తున్నారు. కరోనా ప్రతికూల పరిస్థితుల్లో ఇంటింటికీ వెళ్లి సేవలందించిన వలంటీర్లపై పవన్ దుర్మార్గంగా వ్యాఖ్యానించడం అమానుషం. మా వలంటీర్ సొంత డబ్బు ఖర్చు చేసి వచ్చి నాకు పింఛను అందించింది. వలంటీర్ల సేవలు ఎనలేనివి.

– వలంటీర్ పొట్లూరి రాట్నాలమ్మ, విజయరాయి

నేడు ఎమ్మెల్యే వాసుబాబు కార్యక్రమాలు

గణపవరం: ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈనెల 18వ తేదీ మంగళవారం నియోజకవర్గంలోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారని క్యాంపు కార్యాలయ ప్రతినిధి అడబాల రవి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు భీమడోలు సచివాలయం -2 పరిధిలో గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ ఆరోగ్యకేంద్రం భవనాలను ప్రారంభిస్తారు. 10.30 గంటలకు భీమడోలు మండలం గుండుగొలను సచివాలయం-1 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12గంటలకు గణపవరం మండలం కేశవరంలో, 1గంటకు ముగ్గుళ్లలో నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు ఉంగుటూరు మండలం నారాయణపురంలో 183వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

నేడు బిషప్‌కు సత్కారం

పెదవేగి : ఏలూరు పీఠాధిపతులుగా బాధ్యతలు స్వీకరించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బిషప్ పొలిమేర జయరావును మంగళవారం ఘనంగా సత్కరిస్తామని సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్ తెలిపారు. మంగళవారం కళాశాల యాజమాన్యం, విద్యార్థులు కలిసి బిషప్ జయరావుకు పౌర సన్మానం చేస్తామని, ప్రతి ఒక్కరూ హాజరు కావాలని సూచించారు. ప్రిన్సిపాల్ స్లీవరాజు, ఫాదర్ ధర్మరాజు పాల్గొన్నారు.

ప్రసన్న ఆంజనేయునికి అమావాస్య పూజలు

నిడమర్రు: అడవికొలనులోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం సోమవతీ అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని అప్పాలు, వివిధ పుష్పాలతో ప్రత్యేక అలంకరించారు. ఆలయ అర్చకులు చక్రవర్తుల సుబ్బారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రూ.1.23 కోట్ల వ్యయంతో పాఠశాల అభివృద్ధి

పెదపాడు: రూ.1కోటి 23లక్షల వ్యయంతో పాఠశాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను ఆమె పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని, వంట గది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో 9 అదనపు తరగతి గదులు నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. మరో రెండు తరగతి గదులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆహార పదార్థాలు మరింత రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాల ఆవరణలోని ఫౌండేషన్ స్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఎమ్ఈఓ2 డీవీరమణ, స్థానిక నాయకులు కడిమి గోవిందరావు, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెద్దిరాజు పాల్గొన్నారు.



కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ

రామాలయాల్లో శాంతి కల్యాణోత్సవం



గుండుగొలనులో స్వామి, అమ్మవార్లకు తలంబ్రాలు పోస్తున్న అర్చకులు గోపాలాచార్యులు



సీతారాముల కల్యాణం సందర్భంగా శాంతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

భీమడోలు: గుండుగొలను ప్రసిద్ధిగాంచిన పురాతన సీతారామస్వామి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల జన్మ నక్షత్రంను పురస్కరించుకుని శాంతి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగరాజ్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయంలోని ధృవమూర్తులకు అభిషేకాలు, ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. అర్చకులు తలంబ్రాలు పోసారు. కోవెల ప్రదక్షిణలు చేసారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఉంగుటూరులో సీతారాముల కల్యాణం

ఉంగుటూరు: స్థానిక కమ్మవారి ఆలయంలో రాములవారి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి, 41రోజుల అయిన సందర్భంలో కల్యాణం నిర్వహించారు. శాంతిహోమం శాంతి కల్యాణం నిర్వహించారు.

డివిజినల్ విద్యుత్ కార్యాలయం ఏర్పాటు చేయాలి

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు కేంద్రంగా విద్యుత్ డివిజినల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరక్టర్ ఇమ్మడి పృధ్వీతేజను కోరారు. సోమవారం వైజాగ్ కార్యాలయంలో ఆయనను కలిసి నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై చర్చించి, వినతిపత్రాన్ని అందజేశారు. నిడమర్రు మండలం క్రొవ్విడి, గణపవరం మండలం కేశవరం, ఉంగుటూరు మండలం రాచూరులో నిర్మించ తలపెట్టిన 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. గొల్లగూడెం 132 సబ్‌స్టేషన్ నుంచి నిడమర్రు సబ్‌స్టేషన్ వరకూ నూతన లైన్ల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, ఇందిరమ్మ కాలనీలకు విద్యుత్ సదుపాయం తదితర అంశాలపై ఆయన పృధ్వీతేజతో చర్చించారు.



ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ పృధ్వీతేజను కలిసిన ఎమ్మెల్యే వాసుబాబు

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ



కొత్తముప్పర్రులోని జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



కురెళ్లగూడెంలో మొక్క నాటుతున్న ఎంపీపీ కనమాల రామయ్య, అధికారులు

పెదపాడు: పేదలకు సంక్షేమ పథకాలు మరింత చేరువ చేసేందుకే జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని పాత ముప్పర్రు గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న 11 రకాలు ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు తమ అవసరాలననుసరించి ధ్రువపత్రాలను పొంది పథకాలకు దర ఖాస్తు చేసుకోవాలని సూచించారు. సచివాలయంలో మొక్కలు నాటారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, సర్పంచ్ కోట లలితకుమారి, ఎంపీటీసీ కర్రె అనీల్ కుమార్, తహసీల్దార్ జీ విజయ కుమార్ రాజు, వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్, హౌసింగ్ ఏఈ చైతన్య పాల్గొన్నారు.

సురక్షతో సమస్యలు పరిష్కారం

దెందులూరు: జగనన్న సురక్ష కార్యక్రమంపై అందరి సమస్యలను శాశ్వత పరిష్కారం లభిస్తుందని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఎస్ఎస్ కృపావరం అన్నారు. సోమవారం దెందులూరులో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించిన దరఖాస్తుల ఆధారంగా 294 మందికి కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరీరాజు, ప్రత్యేకాధికారి కృపావరం, తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీవీపీ లక్ష్మి, ఏపీఎం వేణుగోపాల్ అందజేశారు. అనంతరం కమ్యూనిటీ హాలు సమీపంలో వైఎస్సార్ సీపీ నాయకులు పోకల రాంబాబు, కట్టా వెంకట సుబ్బారావు, చల్లా మేరీరాజు, కట్టా ఏసుబాబు, పులిపాటి శ్యామలాదేవి, వలంటీర్లు మొక్కలు నాటారు.

చేబ్రోలు సురక్షలో 1,150 సర్టిఫికెట్లు అందచేత

ఉంగుటూరు: ఇంటింటికీ వలంటీర్లు వెళ్లి పథకాలు అందని వారిని గుర్తించి అలాంటివారికి మేలు చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం ఉంగుటూరు మండలం చేబ్రోలు-1, 2 సచివాలయాల్లో సురక్ష సభలు నిర్వహించారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. సురక్ష సభలో రందే లక్ష్మీసునీత, డీఎల్‌డీవో వెంకటరమణ, తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఆంజనేయులు, పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి, ఎంపీటీసీలు రాయిలక్ష్మి, మనసాల నాగమణి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాజహాన్, డీటీ బొడ్డే పల్లి ప్రసాదు, ఈవోఆర్ షంసుద్దీన్, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు. సభల్లో 1,150 ధ్రువపత్రాలు అందజేశారు.

పథకాలతో కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం

భీమడోలు: సంక్షేమ పథకాలు అర్హులకు చేరడం ద్వారా పేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయని ఎంపీపీ కనమాల రామయ్య అన్నారు. కురెళ్లగూడెంలో సోమ వారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపీపీ కనమాల రామయ్య, మండల ప్రత్యేకాధికారి ఆర్.వి జయ రాజు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పరిపాలనను సాగిస్తుందన్నారు. గ్రామంలో లక్షలాది రూపాయలతో అభివృద్ధి జరుగుతోందన్నారు. గ్రామంలోని 1,043 కుటుంబాలకు జగనన్న సురక్ష సర్వే నిర్వహించి 416 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, ఆర్‌బీకే చైర్మన్ అల్లూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, డిప్యూటీ తహసీల్దార్ షంషూద్దీన్, ఎఎంసీ డైరెక్టర్ నీలపాల కనక మహాలక్ష్మీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.సురేష్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో ఉచిత సేవలు

పెదవేగి : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించే గ్రామ సభలో 11 రకాల ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు ఉచితంగా అందిస్తున్నట్టు పెదవేగి ఎంపీపీ తాత రమ్య అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురంలో గ్రామ సభ నిర్వహించారు. అనంతరం 621 ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు పంపిణీ చేశారు. జగన్నాథపురం సర్పంచ్ మాత్రపు కోటేశ్వరరావు, ఎంపీటీసీ రాచప్రోలు చంద్రరావు, ఎంపీడీవో జి రాజ్‌మనోజ్ పాల్గొన్నారు. పెదవేగి మండలం నడిపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ మేకా అప్పాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. విజయరాయి సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పెదబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెదవేగి మండల ఈఓఆర్‌డీ. బి శ్రీనివాసరావు, ఎంఈఓ అరుణ్, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్ మేక రమేష్, నాయకులు సచివాలయం సిబ్బంది,గ్రామ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు నారాయణపురంలో ‘గడపగడపకు’

ఉంగుటూరు: నారాయణపురంలో 183వ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్టు ఉంగుటూరు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అధికార్లు పాల్గొని జయప్రదం చేయాలని మంగరావు కోరారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

పెదపాడు: విద్యార్థులు ఇష్టంతో చదవాలని జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్ సుందర్ సూచించారు. పెదపాడు మండలంలోని కలపర్రు జెడ్పీహైస్కూల్లో ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రత్యేక తరగతులపై ఆయన ఆరా తీసారు.

పీజీ పరీక్షల్లో దంత వైద్య కళాశాల విద్యార్థినులకు ర్యాంకులు



డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీలో ప్రథమ, తృతీయ స్థానం సాధించిన దంత విద్యార్థులను, ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న ఫాదర్లు

పెదవేగి : సెయింట్ జోసెఫ్ దంత కళాశాలను 2002లో స్థాపించామని ఎంతోమంది విద్యార్థులు దేశ విదేశాల్లో వైద్య సేవలు అందిస్తున్నారని కరస్పాండెంట్ ఫాదర్ జి మోజెస్ తెలిపారు. పెదవేగి మండలం దుగ్గిరాల్లోని దంత కళాశాలలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ ఈ ఏడాది డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించిన పీజీ ఫైనల్ పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థినులు షేక్ నజియా ఓవరాల్‌గా ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. మేరీ మనిషా రెడ్డి మూడో ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన ప్రిన్సిపాల్‌ను ఫాదర్ మోజెస్ పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ స్లీవరాజు, ఫాదర్ ధర్మరాజు, పీడీ నిట్టా నల్లయ్య పాల్గొన్నారు.